వలంటీర్లపై పవన్ వ్యాఖ్యలు దుర్మార్గం

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



లబ్ధిదారుకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కొమ్మాది: ఆడపిల్లలను వలంటీర్లు ఎత్తుకుపోతున్నారని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అనడం చాలా దుర్మార్గంగా ఉందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 4వ వార్డు చేపలుప్పాడలో 6 సచివాలయాలకు సంబంధించి నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఆడపిల్లలు వలంటీర్ వ్యవస్థ వల్ల అపహరణకు గురవుతున్నారని పవన్‌కు ఎవరు చెప్పారో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. 2024లో మరలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని గమనించిన పవన్, చంద్రబాబు కలిసి ప్రభుత్వంపై విషం కక్కుతున్నారన్నారు. వలంటీర్ వ్యవస్థను అవహేళన చేస్తూనే... అధికారంలోకి వస్తే ఆ వ్యవస్థను ఉపయోగించుకుంటామని చంద్రబాబు అంటున్నారని గుర్తు చేశారు. పవన్ కేవలం సినిమాల్లోనే హీరో కానీ, రాజకీయాల్లో జీరో అన్నారు. ఎవరో ఇచ్చిన స్క్రిప్టును చదవడం తప్ప పార్టీ పెట్టి చేసిందేమీ లేదన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తున్న వలంటీర్ వ్యవస్థను దేశంలో అనేక రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని తెలిపారు. కరోనా సమయంలో మన రాష్ట్రంలో తక్కువ సమయంలో ఎక్కువ మందికి పరీక్షలు చేశామని, వలంటీర్ల సహకారంతోనే ఇది సాధ్యమైందన్నారు. జగనన్న సురక్ష ద్వారా 11 రకాల సర్టిఫికెట్లను గంటల వ్యవధిలోనే ప్రజలకు అందిస్తున్నామన్నారు. 33 పథకాల ద్వారా 4వ వార్డులో 58 వేల మంది లబ్ధిదారులకు ఇప్పటి వరకు రూ.56 కోట్లు అందించామని తెలిపారు. ఎన్నికల సమయంలోనే మన దగ్గరకు వచ్చే నాయకుడు కావాలా... ఎన్నికలు ఉన్నా లేకున్నా ప్రజా సంక్షేమం కోసం పరితపించే నాయకుడు కావాలా అని ప్రజలే నిర్ణయించుకోవాలన్నారు. అనంతరం మంగమారిపేట మత్స్యకారులకు ఇవ్వాల్సిన ఇళ్ల పట్టాలు పెండింగులో ఉన్నాయని, మంగమారిపేటలో బోరు తవ్వితే ఉప్పు నీరు వస్తోందని, ప్రత్యామ్నాయంగా వేరే ప్రాంతం నుంచి మంచి నీరు సరఫరా చేయాలని స్థానికులు కోరారు. కార్యక్రమంలో ఆర్‌డీవో భాస్కర్ రెడ్డి, జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, వైఎస్సార్ సీపీ 4వ వార్డు అధ్యక్షుడు పాల రమణారెడ్డి, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

రహదారిపై నిలిచిన నీటితో ఇబ్బందులు



అశోక్‌నగర్‌లో రహదారిపై నిలిచిన నీరు

తగరపువలస: జీవీఎంసీ మధురవాడ జోన్ పీఎం పాలెం, ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ లే అవుట్, అశోక్ నగర్ రహదారి నిర్మాణం లోపభూయిష్టంగా జరిగింది. ఈ కారణంగా వర్షం నీరు రోజుల తరబడి రహదారిపై నిలిచిపోతోంది. రహదారికి అనుసంధానంగా సరైన డ్రైనేజీ లేకపోవడమే కారణం. రోడ్డుపై నిలిచి ఉన్న నీటిలో నుంచి రాకపోకలు సాగించలేకపోతున్నాం. రహదారిపై నుంచి నీరు పోయేందుకు అనుసంధానంగా డ్రైనేజీలు నిర్మించాలి.

– డి.భాస్కర్, ఎస్సీ ఎస్టీ లే అవుట్, పీఎం పాలెం

విత్తనశుద్ధితో తెగుళ్ల నియంత్రణ



కొత్త కొవ్వాడలో విత్తన శుద్ధిపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న హేమసుందర్

పద్మనాభం: రైతులు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలని ప్రకృతి వ్యవసాయం రీజినల్ అధికారి హేమసుందర్ సూచించారు. మండలంలోని కొత్త కొవ్వాడలో బీజామృతంతో విత్తన శుద్ధి చేయడంపై గురువారం మహిళా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హేమ సుందర్ మాట్లాడుతూ విత్తనశుద్ధి చేయడం వల్ల విత్తనాలకు తెగుళ్లను తట్టుకునే శక్తి పెరుగుతుందన్నారు. నవ ధాన్యాలు సాగు చేయడం వల్ల భూమి ఆరోగ్యంగా ఉంటుందన్నారు. సర్పంచ్ పి.రత్నం, ఎన్ఎఫ్ఏలు ఎస్.బాలామణి, శ్రీనివాస్ చక్రవర్తి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎండీయూ ఆపరేటర్ల చేతివాటం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్‌లో ఒకరిద్దరు ఎండీయూ ఆపరేటర్లు రేషన్ పంపిణీలో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. కార్డుదారులకు రేషన్ బియ్యం ఇవ్వకుండా వారే వాటిని కొనుగోలు చేసి తమకు తెలిసిన ఇళ్లల్లో, సొంత ఇళ్ల వద్ద, తెలిసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో నేరుగా బస్తాలతో నిల్వ చేస్తున్నారు. బియ్యం అడిగిన వారితో దురుసుగా వ్యవహరిస్తున్నారు. రేషన్ పంపిణీలో వలంటీర్ల పర్యవేక్షణ కాదని, అంతా తామే అన్నట్టుగా వ్యవహరించి ప్రభుత్వం సరఫరా చేసిన బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. ఇలాంటి ఆపరేటర్లపై పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్, సచివాలయ సిబ్బంది నిఘా ఉంచి కార్డుదారులకు రేషన్ సరకులు సక్రమంగా ఇచ్చేలా చర్యలు చేపట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.

శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి



బాధ్యతలు స్వీకరించిన సీఐ రమేష్

భీమునిపట్నం: భీమిలి పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక దృష్టి సారించనున్నట్టు విశాఖ నార్త్ సబ్ డివిజన్ క్రైం సీఐగా పనిచేస్తూ బదిలీపై భీమిలి వచ్చిన సీఐ డి.రమేష్ తెలిపారు. గురువారం ఆయన ఇక్కడ బాధ్యతలు స్వీకరించి విలేకరులతో మాట్లాడారు. అన్ని ప్రాంతాల్లోనూ ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆకతాయిలు మత్తు పదార్థాలు సేవించడం, యువతులు, మహిళలను వేధిస్తున్న వారిపై ఎక్కువ దృష్టి సారిస్తానని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా నేరుగా వచ్చి ఫిర్యాదు చేయవచ్చని, వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యార్థులకు సామగ్రి పంపిణీ



విద్యార్థులకు సామగ్రి పంపిణీ చేస్తున్న సన్యాసినాయుడు తదితరులు

పద్మనాభం: మండలంలోని విలాస్కాన్‌పాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 22 రకాల సామగ్రిని వైఎస్సార్ సీపీ నాయకుడు బోని సన్యాసినాయుడు, టీచర్స్ హెల్ప్ గ్రూపు గౌరవ అధ్యక్షుడు కంటుబోతు ముత్యాలరావు గురువారం అందజేశారు. టీచర్స్ హెల్ప్ గ్రూపు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో దాత ఎంపీఎస్ఎన్ రెడ్డి, పాఠశాల హెచ్ఎం కోల సన్యాసిరావు, టీచర్ హెల్ప్ గ్రూపు వ్యవస్థాపక అధ్యక్షుడు మరగడ రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మధురవాడ: ఏపీ ట్రాన్స్‌కో మధురవాడ విద్యుత్ సబ్ స్టేషన్ నగరంపాలెం 11 కేవీ ఫీడర్‌పై నిర్వహణ, మరమ్మతులు చేపడుతున్న కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్‌వీఎస్ రామమూర్తి చెప్పారు. ఇందులో భాగంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు గణేష్‌నగర్, పోర్టుకాలనీ, కళానగర్, బొట్టవానిపాలెం, స్వతంత్రనగర్, డాక్‌యార్డు లే అవుట్, వాంబేకాలనీ, శ్రీనివాసనగర్, అయోధ్యనగర్, ఆర్‌టీసీ కాలనీ, మానం ఆంజనేయులునగర్, మల్లయ్యపాలెం, సాక్షి పేపర్ ఆఫీస్ ఏరియా, నగరంపాలెం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు, ప్రజలు సహకరించాలని రామమూర్తి కోరారు.

'జగనన్న సురక్ష' నేడు

ఆనందపురం : మండలంలోని గొట్టిపల్లి, చందక పంచాయతీల్లో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నామని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం ఓ ప్రకటనలో తెలిపారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఈ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారని ఆయన తెలిపారు.

ఉత్తమ బోధనతో ఉపాధ్యాయులకు గుర్తింపు



స్వర్ణలత దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు

ఆనందపురం : మండలంలోని వేములవలస ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీ అయిన హెచ్ఎం స్వర్ణలతను గురువారం పాఠశాలలో సత్కరించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు కోరాడ అప్పలస్వామి నాయుడు మాట్లాడుతూ ఉత్తమ బోధన చేసిన వారికి సమాజంలో ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. సత్కారాలు సేవలకు గుర్తింపునిస్తాయని చెప్పారు. ఈ సందర్భంగా స్వర్ణలత దంపతులను శాలువ, పూలదండలతో సత్కరించి మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సుభాషిణి, పాఠశాల కమిటీ వైస్ చైర్మన్ శ్రీనాథ్‌దీక్షిత్, బోద నారాయణప్పడు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

పశుగ్రాసాల సాగుతో మేలు



మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ రామకృష్ణ

పద్మనాభం: రైతులు పశుగ్రాసాల పెంపకంపై దృష్టి సారించాలని పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కె.రామకృష్ణ సూచించారు. మండలంలోని రేవిడి పంచాయతీ రౌతులపాలెంలో రైతులకు పశుగ్రాసాల పెంపకంపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పశువులకు పచ్చగడ్డి వేయడం వల్ల పోషక విలువలు పెరుగుతాయన్నారు. దశరథ గడ్డి పెంచుకోవడం వల్ల ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలకు మేతకు ఉపయోగపడుతుందన్నారు. గడ్డి కోసే యంత్రం రూ.20 వేలకు సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.కరుణాకరరావు ఏడీ బి.వి.రమణ, పాండ్రంగి పశువైద్యాధికారి అరుణ, ఎంపీటీసీ సభ్యుడు సీర సూరప్పడు, వైఎస్సార్ సీపీ నాయకుడు కోన రమణ పాల్గొన్నారు.

విద్యార్థులే భవిష్యత్ శాస్త్రవేత్తలు



చంద్రయాన్ చిత్రాలతో ధ్యానం చేస్తున్న పద్మనాభం కస్తూర్బా విద్యార్థినులు



ర్యాలీలో సెడార్ పాఠశాల విద్యార్థులు, ఆర్‌జేడీ జ్యోతికుమారి



విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు

ఆనందపురం : విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి భవిష్యత్ భారత శాస్త్రవేత్తలుగా ఎదగాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు సూచించారు. ఇస్రో శాస్త్రవేత్తలు రూపొందించిన చంద్రయాన్ – 3 అంతరిక్ష ప్రయోగం విజయవంతం కావాలని కోరుతూ ఆనందపురం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఉపాధ్యాయులు, విద్యార్థులు గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు తమ మేధస్సుకు పదును పెట్టి దేశాభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. మేధావులను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకొని దేశ సమగ్రత కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కలేషాబేగం, విద్యాలయం ప్రత్యేకాధికారి చంద్రకళ పాల్గొన్నారు.

పద్మనాభం: చంద్రయాన్ – 3 ప్రయోగం విజయవంతం కావాలని కోరుతూ స్థానిక కస్తూర్బా విద్యార్థినులు గురువారం పద్మనాభంలో ర్యాలీ చేశారు. ముందుగా వీరు చంద్రయాన్ చిత్రాలను ముందు పెట్టుకుని ధ్యానం చేశారు. అనంతరం ర్యాలీ చేశారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రయాన్ విజయవంతం కావాలని ర్యాలీ

భీమునిపట్నం: శ్రీహరికోట నుంచి శుక్రవారం ప్రయోగించనున్న చంద్రయాన్ – 3 విజయవంతం కావాలని స్థానిక సెడార్ పాఠశాల విద్యార్థులు గురువారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న ఆర్‌జేడీ జ్యోతికుమారి మాట్లాడుతూ ఉపగ్రహ ప్రయోగాల్లో మన దేశం ప్రపంచ దేశాలకు ధీటుగా పోటీ పడుతోందని పేర్కొన్నారు. ఉపగ్రహాల వల్ల దేశానికి ఎన్నో విధాలుగా ప్రయోజనాలు కలుగుతాయని, ఇది ఎంతో గొప్ప విషయమన్నారు. సూపరింటెండెంట్ పి.ఆనందరెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ స్వప్లీనాపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే కస్తూర్బా గాంధీ విద్యాలయంలోని విద్యార్థినులు ప్రిన్సిపాల్ గంగాకుమారి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.



ర్యాలీలో భీమిలి కస్తూర్బా విద్యాలయ విద్యార్థినులు, ఉపాధ్యాయులు

ట్రిపుల్ ఐటీలకు విద్యార్థినుల ఎంపిక



విజయ



జస్వంతి



మనోజ్ఞ



భావనశ్రీ



శ్రీజ్యోతి



హరిత



భారతి



రేవతి

ఆనందపురం : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలకు ఎంపికయ్యారు. ఆనందపురం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి పూర్తి చేసిన ఎస్.భారతి, ఇ.రేవతి నూజివీడు ట్రిపుల్ ఐటీకి, గొట్టిపల్లి ఉన్నత పాఠశాలలో చదివిన కె.హరిత శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు ఎంపికయ్యారు. ఎస్.భారతి పదో తరగతి ఫలితాల్లో 600 మార్కులకు 588 సాధించి జిల్లా స్థాయిలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ విద్యార్థుల్లో టాపర్‌గా నిలిచి రూ.50 వేలు నగదు బహుమతిని, రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి రూ.75 వేలు నగదు బహుమతిని సాధించింది. ఇ.రేవతి 585 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించి రూ.30 వేలు, రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానం సాధించి రూ.50 వేలు నగదు ప్రోత్సాహకాలను అందుకున్నారు. ఈ మేరకు విద్యార్థినులకు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ట్రిపుల్ ఐటీకి భీమిలి విద్యార్థిని

భీమునిపట్నం: భీమిలి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన ఐతి.విజయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. పదో తరగతిలో 565 మార్కులు సాధించి ప్రస్తుతం ప్రభుత్వ జూనియర్ కాళాశాలలో ఇంటర్ చదువుతోంది. ఈమెకు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో చదవడానికి అవకాశం వచ్చింది. ఈ మేరకు గురువారం మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీహెచ్.సింహాచలం, ఇతర ఉపాధ్యాయులు విజయను అభినందించారు.

పద్మనాభం కస్తూర్బా విద్యార్థినికి...

పద్మనాభం: పద్మనాభం కస్తూర్బా విద్యాలయంలో గత ఏడాది పదో తరగతి ఉత్తీర్ణులైన కోరాడ జస్వంతికి ట్రిపుల్ ఐటీ సీటు లభించింది. ఆనందపురం మండలం తర్లువాడకు చెందిన ఈమె పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో మండల ప్రథమ స్థానంలో నిలిచింది. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలో చదువుకునేందుకు అవకాశం లభించింది. జస్వంతికి స్పెషల్ ఆఫీసర్ గ్రేస్ లిల్లీ, సిబ్బంది అభినందనలు తెలిపారు.

చంద్రంపాలెం హైస్కూల్ నుంచి ముగ్గురు...

మధురవాడ: చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2022 – 23 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో విశేష ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థినులకు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీట్లు వచ్చాయి. 10వ తరగతిలో కె.మనోజ్ఞ 572, కె.భావనశ్రీ 572, శ్రీజ్యోతి 567 మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీకీ ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు ఎం.రాజబాబు చెప్పారు. వీరికి పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలను అత్యున్నతంగా తీర్చిదిద్దాలి



దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాలలో సాంకేతిక శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఉపాధ్యాయులు

తగరపువలస: ప్రభుత్వ పాఠశాలల్లో బోధనకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి అత్యున్నత స్థాయిలో తీర్చిదిద్దాలని కోర్సు కో ఆర్డినేటర్‌గా వ్యవహరించిన భీమిలి డైట్ అధ్యాపకుడు గొట్టేట రవి సూచించారు. భీమిలి మండలం దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 3 నుంచి ఆరు విడతలుగా సాగిన శిక్షణ గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో డిజిటల్ విప్లవానికి నాంది పలికిన ఇంటరాక్ట్ ప్యానెల్, బైజూస్ కంటెంట్ వినియోగంపై ఉపాధ్యాయులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మారుతున్న సమాజ అవసరాలు, సాంకేతిక వనరుల ప్రకారం అప్‌డేట్ కావాలన్నారు. జిల్లా కామన్ పరీక్షల విభాగం కార్యదర్శి కృష్ణకుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులపై ఉంచిన బాధ్యత విద్యా విప్లవానికి దోహదపడుతుందన్నారు. దీనిని సంతోషంగా నెరవేర్చాలన్నారు. శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కృష్ణకుమార్, పాత్రుడు, కొండబాబు, శారద, అప్పలరాజు, రఘు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఎన్‌ఎస్‌సీ ప్రోగ్రాం అధికారి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ మేలు గుండెల్లో దాచుకున్నాం



వాంబేకాలనీలో లబ్ధిదారుకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో వాంబేకాలనీ మహిళలు

మధురవాడ: ప్రజలంతా తలెత్తుకుని తిరిగే రోజులు మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారని, ఆయన చేసిన మేలును అంతా గుండెల్లో గుర్తుంచుకుంటున్నామని మధురవాడ వాంబేకాలనీ నివాసి యశోదమ్మతోపాటు పలువురు మహిళలు పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో పింఛన్లు, రేషన్ కోసం ఎక్కడెక్కడికో వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు ఇంటి వద్దకే తెచ్చి ఇస్తున్నారంటూ హర్షం వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జీవీఎంసీ 7వ వార్డు 57వ నంబరు సచివాలయం పరిధి వాంబేకాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు నాయకులకు హారతులు ఇచ్చి సాదరంగా ఆహ్వానం పలికారు. అనంతరం కాలనీలోని నివాసాల వద్దకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని, ప్రభుత్వం ద్వారా జరిగిన మేలును వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మళ్లీ జగన్ మోహన్‌రెడ్డి సీఎం అయితేనే ఈ సంక్షేమ పథకాలు, వలంటీర్, సచివాలయ వ్యవస్థలు కొనసాగుతాయన్నారు. పిచ్చి కల్యాణ్, చంద్రబాబు మాటలు మారుస్తూ ఓర్వలేనితనంతో అబద్ధాలు చెబుతున్నారన్నారు. కరోనా సమయంలో ఎన్నో సేవలు అందించిన వలంటీర్లు అమ్మాయిలను ఎత్తుకుపోయేవారని నిందలేస్తున్నారని... వారంతా తగిన బుద్ధి చెబుతారన్నారు. యూపీహెచ్‌సీలో మందుల కొరతతోపాటు ప్రసూతి సేవలు అందుబాటులోకి తేవాలని, ఇక్కడ అందని వైద్య సేవలకు నేరుగా కేజీహెచ్‌కి పంపించే విధంగా చర్యలు చేపట్టాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని, ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, వార్డు సచివాలయాల ఇన్‌చార్జి కుడితి రామారావు, రామిరెడ్డి, ఎల్లాజీ, పోలారావు, రాజు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు పెంద్ర అప్పన్న, శ్రీశైన కార్పొరేషన్ డైరెక్టర్ పందిరి నారాయణమ్మ, కె.మంగ, ఎంవీ రమణమూర్తి, లోహిత్, భాగం స్వాతి సుధాకర్, జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సరుగుడు తోట నరికివేతపై వివాదం

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ పంచాయతీకి చెందిన మాజీ సైనికులు సరగడ రాజారెడ్డి, జీరు రమణకు చెందిన ఎకరా సరుగుడు తోటను భీమిలికి చెందిన ఏపీఈపీడీసీఎల్ ఉన్నతోద్యోగి ఒకరు సిబ్బందితో నరికి వేయించిన సంఘటన గురువారం వివాదాస్పదంగా మారింది. 1977 నుంచి సర్వే నంబర్ 141లో అనుభవంలో ఉన్న భూమిలో బాధితులు సరుగుడు తోట వేసుకోగా సదరు విద్యుత్ శాఖ ఉద్యోగి సిబ్బందితో వచ్చి రంపాలతో తోటను కోయించేశారు. బాధితులు వచ్చి నిలదీయగా సిబ్బంది కారు వదిలేసి పారిపోయారు. తర్వాత బాధితులు భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేయగా విద్యుత్ ఉన్నతోద్యోగి కూడా ఫిర్యాదు చేశారు. 2014లో తాను ఈ భూమి కొనుగోలు చేసినట్టు చెప్పడం గమనార్హం. దీనిపై పోలీసులు విచారణ చేపట్టనున్నారు.

వృద్ధుడు అదృశ్యం



డెంకాడ అప్పన్న

ఆనందపురం : మండలంలోని మామిడిలోవ పంచాయతీ, దబ్బంద ఎస్సీ కాలనీకి చెందిన డెంకాడ అప్పన్న అదృశ్యమైనట్టు ఫిర్యాదు అందిందని ఏఎస్‌ఐ పైడిరాజు గురువారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. దబ్బంద ఎస్సీ కాలనీకి చెందిన డెంకాడ అప్పన్న (60) ఈ నెల 8న మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో తోటలోకి వెళ్తానని ఇంటి వద్ద చెప్పి వెళ్లాడు. అలా వెళ్లిన వ్యక్తి తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో కుటుంబ సభ్యులు అన్ని ప్రాంతాల్లో వెతికినా అప్పన్న ఆచూకీ లభ్యం కాలేదు. ఈ మేరకు అతని కుమారుడు గోవింద్ ఫిర్యాదుతో ఏఎస్‌ఐ పైడిరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డాక్టర్ సుధాకర్ రెడ్డికి పరామర్శ

భీమునిపట్నం: భీమిలి మున్సిపల్ మాజీ చైర్మన్ డి.శైలేంద్రరెడ్డి తండ్రి డాక్టర్ డి.సుధాకర్ రెడ్డిని గురువారం ఆయన నివాసంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పరామర్శించారు. ఆయన కొంత కాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్నారు. కాగా ఆయన 45 సంవత్సరాలు వైద్య సేవలు అందించి అందరి మన్ననలు పొందారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి యోగ క్షేమాలను శైలేంద్రరెడ్డిని అడిగి ఎమ్మెల్యే ముత్తంశెట్టి తెలుసుకున్నారు. ఆయనతోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

కుక్కల నుంచి పశువులను కాపాడాలని వినతి

తగరపువలస: భీమిలి మండలం లక్ష్మీపురం పంచాయతీలో కుక్కల బారి నుంచి తమ పశువులను కాపాడాలని స్థానిక పాడి రైతులు వేడుకుంటున్నారు. గత నెల 28న పంచాయతీలో వీధి కుక్కలు దాడి చేసి లచ్చుబుగత రమణకు చెందిన ఆవుదూడను తీవ్రంగా గాయపరిచి చంపేసిన సంగతి తెలిసిందే. ఇటీవల మూడు రోజుల వ్యవధిలో ఇదే పంచాయతీకి చెందిన కనకల అంకయ్యమ్మ, కనకల శీనమ్మ, మరో కుటుంబానికి చెందిన మూడు మేకలను కుక్కలు పొట్టన పెట్టుకున్నాయి. దీంతో పంచాయతీలో తమ పశువులకు రక్షణ లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు. ఈ మేరకు సచివాలయ సిబ్బందికి గురువారం వినతిపత్రం అందించారు.

బస్సుల సమయ పట్టిక ఏర్పాటు చేయాలి

తగరపువలస: నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి మధురవాడ ఐటీ హిల్స్‌కు నడిచే సిటీ బస్సుల సమయ పట్టికలు ముఖ్యమైన కూడళ్లలో ఏర్పాటు చేయాలని మధురవాడ జోన్ ప్రజలు కోరుతున్నారు. ఇటీవల 25టి పేరుతో ఐటీ హిల్స్‌కు పునరుద్ధరించిన బస్సుల రాకపోకల విషయాలు పెద్దగా తెలియడం లేదంటున్నారు. వీటి రాకపోకల సమయాన్ని తెలిపే పట్టికలు మధురవాడ, కొమ్మాది, మారికవలస, హరిత అపార్ట్‌మెంట్స్, ఐటీ హిల్స్ కూడళ్ల వద్ద ప్రదర్శించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.